సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 30 । సెప్టెంబర్ । 2022

వైభవంగా బతుకమ్మ సంబరాలు



ఎటపాక: విలీన మండలాల్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎటపాక మండలంలోని ఎటపాక, తోటపల్లి, గౌరీదేవిపేట, నందిగామ,మురుమూరు తదితర గ్రామాల్లో మహిళలు,చిన్నారులు అందంగా పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఆలయాలకు చేరుకుంటున్నారు. వాటి చుట్టూ తిరుగుతూ ఆట పాటలతో సందడి చేసి పూజలు చేస్తున్నారు.గురువారం తోటపల్లి శ్రీఆదిత్య స్కూల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఆకట్టుకున్నాయి.

మన్యంలో విస్తారంగా వర్షాలు



- దేవీపట్నంలో 60.2 ఎంఎం అత్యధికం..
- అరకులో 1.4 ఎంఎం అత్యల్ప వర్షపాతం నమోదు

IIలో

న్యూస్‌రీల్

పేదలందరికీ సొంత గూడు

గృహ నిర్మాణశాఖ డైరెక్టర్ డేవిడ్



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న గృహ నిర్మాణశాఖ డైరెక్టర్ డేవిడ్

అరకులోయ: రాష్ట్రంలోని పేదలందరికీ సొంత గూడు కల్పించాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని, ఈ మేరకు జగనన్న సంపూర్ణ గృహ పథకం ద్వారా ఇళ్ల మంజూరు చేస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణశాఖ డైరెక్టర్ వి.డేవిడ్ తెలిపారు. గురువారం ఆయన అరకులోయలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన ప్రాంతాల్లోని మోడల్ కాలనీలకు సంబంధించి ఇంత వరకు వేసిన లేఅవుట్లు, లబ్ధిదారులకు పంపిణీ చేసిన స్థలాల వివరాలను తెలుసుకున్నారు. మండలాల వారీగా ఇళ్లులేని పేద గిరిజనుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదల జాబితాలను వెంటనే సేకరించి ప్రభుత్వానికి అందజేయాలన్నారు.

రెండు గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ లక్షణాలు



లంపీ స్కిన్ వ్యాధికి గురైన పశువు

అనంతగిరి: మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ చిందులపాడు, తట్టపుడి గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు బయట పడ్డాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఏజెన్సీలోని పలు గ్రామాల్లో పశువులు ఈ వ్యాధి బారిన పడుతున్నాయి. దీనిపై ఇప్పటికే జిల్లా పశువైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పర్యాటక బోట్ల తనిఖీ పూర్తి



బోట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

దేవీపట్నం: గోదావరిలో పాపికొండల పర్యటనకు నడిపే పర్యాటక బోట్ల తనిఖీ పూర్తయింది. ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, జాయింట్ మేనేజర్ పవన్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ గంగబాబు బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు పోశమ్మగండి వద్ద ఉన్న బోట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బోటు కెపాసిటీ, ఇంజిన్ సామర్థ్యం తనిఖీ చేశారు. గోదావరి వరదలు తగ్గిన అనంతరం పాపికొండల విహార యాత్రను ప్రారంభించనున్నారు.

విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం

- జిల్లా వ్యాప్తంగా పెరిగిన సాగు
- వివిధ వంటలు పండిస్తున్న గిరిజన రైతులు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



గులిరాగి నాట్ల విధానాన్ని రైతులకు వివరిస్తున్న అధికారులు



ప్రకృతి సాగు విధానం గురించి తెలుసుకుంటున్న విదేశీయులు

డుంబ్రిగుడ: జిల్లాలో సేంద్రియ సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అండగా నిలుస్తుండడతో సేంద్రి య సాగువైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నష్ట భయం లేకపోవడంతో దీనిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు ఇటీవల జిల్లాలో సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. వారు తమ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ప్రజల ఆహార అలవాట్లలో మార్పులు రావడంతో సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం పెరుగుతోంది. డిమాండ్ పెరిగి గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఈ సాగుపై గిరిజన రైతులు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలో ప్రకృతి సాగుపై విదేశీయులు సైతం అధ్యయనం చేస్తున్నారు. ఇటీవల ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంట్ సొల్యూషన్ ప్రతినిధి జేమ్స్ రోమాక్స్ పాడేరు డివిజన్‌లో పర్యటించి అధ్యయనం చేశారు. డుంబ్రిగుడ మండలంలో సాగర, గసుబ గ్రామాలను జర్మనీ దేశస్తులు సందర్శించి, ప్రకృతి సాగు గురించి తెలుసుకున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రకృతి విధానంలో ఈ ఏడాది 74,965.80 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. దీనిలో అధికంగా పాడేరు మండలంలోని 10,600 ఎకరాల్లో సాగు చేయాలని నిర్ణయించారు. ఇంతవరకు 45,772 మంది గిరిజన రైతులు 41,135.75 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. దీనిలో విత్తన దశ నుంచి పంట కోత వరకు పూర్తిస్థాయిలో 19 వేల ఎకరాల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. మిగిలిన వారు సాధారణ పద్ధతిలో సాగు చేస్తూ కొన్ని విధానాలను మాత్రమే అనుసరిస్తున్నారు. ప్రధానంగా వరి,పసుపు,కాఫీ ,మిరియాలు,వంగ,క్యాబేజీతో పాటు అన్ని రకాల కూరగాయలు,రాగులు,కొర్రలు,సామలు వంటి వివిధ రకాల చిరుధాన్యాలు, దుంపజాతులను పండిస్తున్నారు. రైతులకు ఆదా యం పెరగడమే కాకుండా,భూసారం పెరుగుతూ వస్తోంది. డుంబ్రిగుడ మండల మండలంలోని మారుమూల ఆంధ్రా–ఒడిశా సరిహద్దు సొవ్వ, గసభ, కోల్లాపుట్టు, సాగర వంటి గ్రా మాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయాన్నే నమ్ముకుని పంటలు పండిస్తున్నారు.

పదేళ్ల నుంచి ప్రకృతి సాగు



గత 10 ఏళ్ల నుంచి కూడ గ్రామంలో అందరం రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాం. సేంద్రియ ఎరువులు మాత్రమే వినియోగిస్తూ అధిక దిగుబడులు, ఆదాయం పొందుతున్నాం.

– నాగరాజు, గిరిజన రైతు, కూడ గ్రామం, డుంబ్రిగుడ మండలం

రైతులకు అవగాహన



జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై రైతు సాధికార సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తూ విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

–దేవుళ్లు, ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడు

జిల్లాలో మండలాల వారీగా సాగు లక్ష్యం

మండలాలు	ఎకరాల్లో
అనంతగిరి	2,675.65
అరకు	2,141.25
డుంబ్రిగుడ	4,644.56
పెదబయలు	3,298.25
ముంచంగిపుట్టు	6,679.84
హుకుంపేట	5,858.75
పాడేరు	10,600.86
జి.మాడుగుల	4,180.25
చింతపల్లి	5,473.35
జీకే వీధి	2,910.90
కొయ్యూరు	517.50
దేవీపట్నం	1,051.50
మారేడుమిల్లి	731.50
రంపచోడవరం	2,988.25
అడ్డతీగల	1,151.25
రాజవొమ్మంగి	1,839.70
గంగవరం	4,437.49
వై.రామవరం	3,596.75
చింతూరు	3,662.50
కూనవరం	2,435.00
నెల్లిపాక	1,269.00
వీఆర్ పురం	2,821.70

ఓటర్ల అభీష్టం మేరకే ఆధార్ సీడింగ్

ఎన్నికల అధికారితో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్, డీఆర్‌వో దయానిధి

సాక్షి, పాడేరు: ఓటర్ల సవరణ జాబితాను అక్టోబర్ 1వ తేదీ నుంచి రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితా రూపకల్పన, ఇతర అంశాలపై ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి పలు అంశాలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఎన్నికల అధికారి దృష్టికి తీసుకువెళ్లారు. ఓటర్ల అభీష్టం మేరకే ఓటరు కార్డుతో ఆధార్ సీడింగ్ చేస్తున్నామని, క్లెయిములు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయ ఎన్నికల అధికారుల నుంచి ఎప్పటికప్పుడు నివేదికలు కూడా తెప్పించుకుంటున్నామని, జిల్లాలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేస్తామని, అక్టోబర్ 3న రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో బి.దయానిధి పాల్గొన్నారు.

అటవీ లాగింగ్ డివిజన్ రద్దు

ఇకపై అటవీ డివిజన్ పర్యవేక్షణలోనే కలప సేకరణ, విక్రయాలు



చింతూరు డిపోలో టేకు కలప



చింతూరులోని లాగింగ్ డివిజన్ కలప డిపో

చింతూరు: జిల్లాల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా అటవీ డివిజన్లు ఏర్పడడంతో చింతూరు లాగింగ్ డివిజన్‌ను రద్దుచేసి అటవీ డివిజన్‌లో కలిపారు. చింతూరు డివిజన్‌లో అటవీ డివిజన్‌తో పాటు లాగింగ్(కలప) డివిజన్ కూడా ఉంది. ఇంతకాలం చింతూరు అటవీ శాఖలో రెండు డివిజన్లు కొనసాగుతుండగా, ఇకపై అటవీ డివిజన్ మాత్రమే కొనసాగనుంది. లాగింగ్ డివిజన్ రద్దయిన నేపథ్యంలో ఆ డివిజన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులంతా అటవీ డివిజన్‌లో కొనసాగనున్నారు. డీఎఫ్‌వో పోస్టు కూడా రద్దయింది. లాగింగ్ డివిజన్‌కు సంబంధించిన కలప, వెదురు విక్రయాలు, కలప కటింగ్ వ్యవహారాలన్నీ అటవీ డివిజన్ డీఎఫ్‌వో పర్యవేక్షణలోనే జరుగనున్నాయి.

గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చింతూరు డివిజన్లలోని నాలుగు మండలాలకు సంబంధించిన లాగింగ్(కలప సేకరణ, విక్రయాలు) వ్యవహారాలన్నీ భద్రాచలం అటవీ డివిజన్ పరిధిలో కొనసాగేవి. రాష్ట్ర విభజన అనంతరం 2015లో కొత్తగా చింతూరు లాగింగ్ డివిజన్ ఏర్పడింది. చింతూరు, వీఆర్‌పురం మండలం రేఖపల్లిలో కలప, చింతూరు, మోతుగూడెంలో వెదురు డిపోలున్నాయి. ఈ డిపోల్లో ప్రతినెలా డీఎఫ్‌వో పర్యవేక్షణలో కలప, వెదురు వేలంపాటల నిర్వహణ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. లాగింగ్ డివిజన్‌లో డీఎఫ్‌వోతో పాటు ముగ్గురు రేంజ్‌ఆఫీసర్లు, ముగ్గురు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఏడుగురు సెక్షన్ ఆఫీసర్లతో సహా 28మంది విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం లాగింగ్ డివిజన్ రద్దు కావడంతో అందులోని డీఎఫ్‌వోపోస్టు మినహా మిగతా27 పోస్టులు అటవీడివిజన్‌లో కలిశాయి. దీంతో అటవీ డివిజన్‌లో పోస్టులసంఖ్య 263కు పెరిగింది.

విక్రయానికి సిద్ధంగా మేలైన కలప, వెదురు

ఇకపై అటవీ డివిజన్ ఆధ్వర్యంలోనే కలప సేకరణ, విక్రయాలు కొనసాగుతాయని చింతూరు అటవీ డివిజన్ డీఎఫ్‌వో వి.సాయిబాబా తెలిపారు. చింతూరు, రేఖపల్లి, మోతుగూడెం డిపోల్లో మేలైన కలప, వెదురు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. చింతూరు డిపోలో 2016 సీఎంటీలు, రేఖపల్లి డిపోలో 60.45 సీఎంటీల కలప, చింతూరు డిపోలో 11,079, మోతుగూడెం డిపోలు 5,173 వెదురు స్టాకు ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతీనెలా 17న చింతూరులో, 28న రేఖపల్లిలో కలప, 19న ఉదయం మోతుగూడెంలో, మధ్యాహ్నం చింతూరు డిపోల్లో వెదురు వేలంపాట ఉంటుందని, చింతూరు డిపోలో ప్రత్యేక వేలంపాట నిర్వహిస్తామని డీఎఫ్‌వో తెలిపారు.

జిల్లాలో వేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కలెక్టర్ సుమిత్ కుమార్ నివేదించారు. ప్రభుత్వ పథకాల అమలుపై గురువారం కలెక్టర్లు, ఇతర అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, సచివాలయాలకు మంజూరు చేసిన నిధులతో శాసనసభ్యుల ఆమోదం మేరకు పనులు చేపట్టేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలు, భవన నిర్మాణాలపై జిల్లా అధికారులు సీఎంకు నివేదించారు. కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ జె.శివ శ్రీనివాస్, ఎస్పీ సతీష్‌కుమార్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ మురళీ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఎస్.బి.ఎస్ నందు, రమేష్‌కుమార్, హౌసింగ్ పీడీ సురేష్ కుమార్, పీఐయూ ఈఈ లావణ్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పౌష్టికాహారంతో ఆరోగ్యం

- తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీలు పనిచేయాలి
- అరకు ఎంపీ గొడ్డేటి మాధవి



అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్లు అందజేస్తున్న ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, సబ్ కలెక్టర్ అభిషేక్

సాక్షి,పాడేరు: సంపూర్ణ పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని, తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. స్థానిక కాఫీ గెస్ట్‌హౌస్ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలను ఎంపీ గొడ్డేటి మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నాణ్యమైన పౌష్టికాహారాన్ని వండి అందించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో లభ్యమయ్యే ఎర్ర కందులు, గుమ్మడికాయలు, చిరుధాన్యాల వినియోగంపై కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత సమస్య లేకుండా చూడాలన్నారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన ఆహారపదార్థాలను రుచిచూశారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవోలు పాల్గొన్నారు.

చేయూతతో ఆర్థికాభివృద్ధి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- రూ.6 కోట్ల విలువైన వైఎస్సార్ చేయూత చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు



సమావేశానికి భారీగా వచ్చిన మహిళలు

కొయ్యూరు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడమే చేయూత లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక కస్తూర్బా విద్యాలయం ఆవరణలో గురువారం మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు అధ్యక్షతన నిర్వహించిన మూడో విడత చేయూత పథకం ప్రారంభానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె రూ.6 కోట్ల విలువైన చేయూత చెక్కును పంపిణీ చేశారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేయూత నిధులతో స్వయం ఉపాధి ఏర్పాటుచేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం తమ ప్రభుత్వమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తమ ప్రభుత్వం నూరుశాతం సఫలమైందన్నారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలు తల ఎత్తుకునేలా చేశారన్నారు. ఆయన పెట్టిన పథకాలతో మహిళల జీవితాలలో మార్పు వచ్చిందన్నారు. మహిళలు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టపడితేనే ఫలితాలు వస్తాయన్నారు. కొందరు పచ్చపార్టీల నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, అలాంటి వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సీనియర్ నేత గాడి సత్యనారాయణ, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ వైకుంఠరావు, ఏపీఎం శ్రీనివాస్, ఎంపీడీవో మేరీరోజ్, చింతపల్లి మైనారిటీ విభాగం అధ్యక్షుడు నాగూర్‌బాబు, మహిళా విభాగం అధ్యక్షురాలు కె రాజులమ్మ, తహసీల్దారు తిరుమలరావు పాల్గొన్నారు. చేయూత నిధులను సద్వినియోగం చేసుకున్న విధానాన్ని లబ్ధిదారులు సత్యవతి, రమణమ్మ వివరించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- 7,600 మందికి రూ.14.25 కోట్ల చెక్కు అందజేత



అడ్డతీగలలో చేయూత మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ప్రజాప్రతినిధులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ప్రజాప్రతినిధులు.

అడ్డతీగల: మహిళల ఆర్థిక స్వావలంబనకే రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చేయూత మూడవ విడత ప్రారంభోత్సవం నిర్వహించారు. అడ్డతీగల, రాజవొమ్మంగి ,గంగవరం, వై.రామవరం మండలాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ అయ్యే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అయిన తరువాత వైఎస్ జగన్ నవరత్నాల పథకాల్లో పొందుపరిచారన్నారు. ఇచ్చిన హామీ మేరకు 45 నుంచి 60 ఏళ్ల లోపు వయసు గల వయసు కలిగి అర్హత ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతున్నారన్నారు. నాలుగు మండలాలకు చెందిన 7,600 మంది మహిళలకు రూ.14.25 కోట్లు విలువైన చెక్కును ఎమ్మెల్యే ధనలక్ష్మితో పాటు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు కలిసి మహిళలకు అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీడీ శ్రీనివాసరావు, ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, నాలుగు మండలాలకు చెందిన మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



కొత్తపల్లి జలపాతంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: దసరా సెలవులు కావడతో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతానికి సందర్శకులు భారీగా తరలివచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. వ్యూపాయింట్ వద్ద సెల్ఫీలు దిగారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు

- దేవీపట్నంలో 60.2 ఎంఎం అత్యధికం..
- అరకులో 1.4 ఎంఎం అత్యల్ప వర్షపాతం నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పలు చోట్ల గత మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రోజూ కురుస్తున్న వర్షాలతో మరల ప్రధాన గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి నెలకొంది. మత్స్యగెడ్డలో నీటి ప్రవాహం అధికమైంది. గురువారం పాడేరుతో పాటు అనేక మండలాల్లో వర్షం కురవడంతో జనజీవనానికి కాస్త అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 222 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. దేవీపట్నంలో 60.2, రాజవొమ్మంగిలో 37.2, కొయ్యూరులో 36.8, వై.రామవరంలో 11.2, జి.కె.వీధిలో 10.8, రంపచోడవరంలో 10.4, గంగవరంలో 5.4, ఎటపాకలో 5.2, మారెడుమిల్లిలో 4.2, కూనవరంలో 3.2, హుకుంపేటలో 2, ముంచంగిపుట్టులో 1.6, అరకులోయలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోజూ కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లోని వరి, ఉద్యానవన పంటలకు మేలు చేస్తాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

కొయ్యూరు: మండలంలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. వట్టికాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

చింతపల్లి: మండల కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కుండపోత వర్షం కురవడంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది.



జి.మాడుగులలో కురుస్తున్న వర్షం

రోడ్లు జలమయం

జి.మాడుగుల: మండలంలో పలు చోట్ల గురువారం ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. గెడ్డలు, కాల్వలు వర్షపునీటితో కళకళలాడాయి. సొలభం, గడుతూరు, వంతాల, గెమ్మెలి, వంజరి పంచాయతీల్లో పలు గ్రామాల్లో వర్షం వలన వీధులు బురదమయం అయ్యాయి.

పెదకోడాపల్లి సర్పంచ్ మృతి

నివాళి అర్పించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వెంకటరమణ (ఫైల్)



రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: మండలంలోని పెదకోడాపల్లి పంచాయతీ సర్పంచ్ సెగ్గె వెంకటరమణ(45) గుండెపోటుతో బుధవారం రాత్రి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామం బంగారుపుట్టులో అంత్యక్రియలు నిర్వహించారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బంగారుపుట్టులో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్ సీపీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేసి సర్పంచ్‌గా గెలిచారని, నిత్యం పంచాయతీలో సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చేవారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఈనెల 30 నుంచి పెదకోడాపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించేందుకు సిద్ధం చేశామని, ఇంతలో అతని మరణం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందన్నారు. అరకు ఎంపీ మాధవి సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు టి. నర్సింగరావు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుజ్జిబాబు సంతాపం తెలిపారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, జెడ్పీటీసీలు కూడ బొంజుబాబు, రేగం మత్స్యలింగం, దీసరి గంగరాజు, ఎంపీపీ వరహాలమ్మ, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు,పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

పాడేరు రూరల్: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసేందుకు నిర్వహించే నేషనల్ మిన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ పి.రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రూ.50 చొప్పున పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల చేయూత

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



కిట్లు పంపిణీ చేస్తున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సూచించారు. వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న, ఆర్థికంగా వెనుకబడిన 300 మంది మహిళలకు జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నెస్ట్ కంపెనీ ఆర్థిక సాయంతో నిత్యావసర సరకుల కిట్లు గురువారం పంపిణీ చేశారు. స్థానిక యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పీవో మాట్లాడుతూ గిరిజనులను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ఎన్‌జీవోలు చేయూతనివ్వాలని తెలిపారు. ఏజెన్సీలో ఆర్థికంగా వెనుకబడిన వారికి కిట్లు పంపిణీ అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాలు, ఆర్వో ప్లాంటులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అనిరుధ్, హర్షవర్ధన్‌రెడ్డి, మత్రి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘం సమాఖ్య చైర్మన్ వసీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ విద్రోహక శక్తులకు దూరంగా ఉండండి

ఎస్ఐ రవీంద్ర సూచన



జబడలో వాలీబాల్ కిట్లు అందిస్తున్న ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: మారుమూల గిరిజనులు సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండి అభివృద్ధి పథంలో నడవాలని ఎస్ఐ కె.రవీంద్ర సూచించారు.మండలంలోని అత్యంత మారుమూల బుంగాపుట్టు,లక్ష్మీపురం పంచాయతీల్లో గెడ్డలు దాటుకొని జబడ,బిర్రిగూడ,గర్రం,సంగంవలస,బంగారుపల్లి,బొర్రమామిడి గ్రామాలకు వెళ్లారు. క్యాప్-7 పోలీసులు, 15 స్పెషల్ పార్టీ పోలీసులు గిరిజనులతో మమేకమయ్యారు. గిరి యువతకువాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు.

పి.యర్రగొండ ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ



అరకులో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచన పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు

వై.రామవరం: అరకులో జరిగిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 50 మంది పాల్గొన్నారు. వాలీబాల్, కోకో, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, జావెలెన్‌త్రో తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 20 గోల్డ్ మెడళ్లు, 18 సిల్వర్ మెడళ్లు, 7 బ్రాంజి మెడళ్లు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అభినందించారు.

కుళ్లిన కోడిగుడ్ల పంపిణీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



లోగేలి అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్

దుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ లోగేలి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన గుడ్లు పంపిణీ అనే శీర్షికతో సాక్షి దిన పత్రికలో గురువారం ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ నాగమణితో విచారణ నిర్వహించామని సీడీపీవో నీలిమ తెలిపారు. దీనిపై నివేదిక అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి



రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ ఓసీ రాజు

గిరి రైతులకు పోలీసుల సూచన

జి.మాడుగుల: గంజాయి పంటకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటల పట్ల గిరి రైతులు దృష్టి సారించాలని సీఐ సత్యనారాయణ, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజు, ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలంలో సుర్మతి, కోరాపల్లి, పెదలువ్వాసింగి, బొయితిలి, కిల్లంకోట పంచాయతీలకు చెందిన గిరిజన రైతులకు గురువారం 'పరివర్తన'లో భాగంగా 90 శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి రాజ్‌మా, కూరగాయ పంటలు పండించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. మండల వ్యవసాయాధికారి లకే రవీంద్ర పాత్రుడు, ఏఎస్ఐ సుబ్బారావు, హెచ్‌సీ అప్పలరాజు పాల్గొన్నారు.

వాల్మీకులపై నిరాధార ఆరోపణలు

- పీవోను కలిసిన ఆ సంఘం నాయకులు
- గిరిజన సంక్షేమ, సాంస్కృతిక సంఘంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేను కలిసిన వాల్మీకి సంఘం నాయకులు

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్‌లో వాల్మీకి తెగలేదని ఆదివాసీ (గిరిజన) ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం ఐటీడీఏ పీవోకు నిరాధారమైన ఫిర్యాదులు చేశారని వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్లె నారాయణ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరేను కలిసి ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘంపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ఇలాంటి ఆరోపణలు చేశారన్నారు. దీంతో ఆ సంఘం యొక్క స్థితిని కాకినాడ, రాజమహేంద్రవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆర్టీఐ ద్వారా తెలుసుకున్నామని వివరించారు. ఆ సంఘం పేరుతో రిజిస్ట్రేషన్ లేదని లిఖిత పూర్వకంగా అధికారుల నుంచి పొందినట్టు తెలిపారు. దీంతో గిరిజన తెగల మధ్య విభేదాలు, విద్వేషాలు, కుల,మత ప్రాంత బేధాలు సృష్టిస్తున్నారన్నారని ఆ సంఘ నిర్వాహకులపై 2017లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైనట్టు పీవోకు తెలిపారు. దీనిపై తప్పుడు ఫిర్యాదులు చేయమని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవచ్చని వారు లిఖిత పూర్వకంగా రూ.100 స్టాంప్ పేపరుపై ఒప్పంద పత్రం రాయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ, సాంస్కృతిక సంఘం డివిజన్ పరిధిలో వాల్మీకి తెగలేదని ఫిర్యాదు చేసిందన్నారు. తక్కువ జనాభా ఉన్న తమ తెగపై నిరంతరం ఉన్నతాధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్న ఆ సంఘంపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పీవోను కలిసిన వారిలో మారేడుమిల్లి జెడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు తదితరులు ఉన్నారు.అనంతరం రంపచోడవరం ఏఎస్పీ కార్యాలయంలో ఆదివాసీ (గిరిజన) సంక్షేమ, సాంస్కృతిక సంఘం, నేతలపై ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు.

అడ్డంకులు తొలగించి రోడ్డు నిర్మాణం పూర్తిచేయండి



వలస గ్రామానికి అటవీ ప్రాంతం గుండా బైక్‌పై వెళ్తున్న ఎంపీపీ కడబాల ఆనందరావు



కొండవాగులోంచి అష్టకష్టాలు పడి బైక్‌ను దాటిస్తున్న ఎంపీపీ తదితరులు

వై.రామవరం: మండలంలోని కోట, శిరిమెట్ల గ్రామాల మీదుగా చింతలపూడి గ్రామ రోడ్డుకు అటవీశాఖ అడ్డంకులు తొలగించి నిర్మాణం పూర్తి చేయాలని ఆప్రాంత వాసులు కోరారు. స్థానిక ఎంపీపీ కడబాల ఆనందరావు, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మద్దికొండ బారతిబాబు, మడి బాబీ గురువారం శిరిమెట్ల గ్రామం మీదుగా చింతలపూడికు బైక్‌లపై వెళ్లారు. వర్షం కురవడంతో వారు తిరుగు ప్రయాణంలో అష్టకష్టాలు పడ్డారు. కొండవాగు పొంగడంతో బైక్‌లు దాటించేందుకు సమస్యలు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాగుపై వంతెన నిర్మాణంతోపాటు, అటవీశాఖ అడ్డంకులు తొలగించి నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వారిని స్థానికులు కోరారు.

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకరం

ముంచంగిపుట్టు: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఎంపీడీవో డీసీహెచ్ ప్రభాకరం సూచించారు. గురువారం ఆయన వనుగుమ్మ, మాకవరం గ్రామ సచివాలయాలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు.

క్లుప్తంగా

నాడు-నేడు పనులకు భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి : మండలంలోని కొత్త వెలగలపాలెం, పాత వెలగలపాలెం గ్రామాల్లోని రెండు పాఠశాలలకు మంజూరైన నాడు నేడు పనులకు స్థానిక ఎంపీపీ గోము వెంకటలక్ష్మి గురువారం భూమి పూజ చేశారు. పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వినర్ శింగిరెడ్డి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, సర్పంచ్‌లు దాసరి నాగేశ్వర్రావు, కొంగర మురళీకృష్ణ, సవిరెల చంద్రుడు, ఎంపీటీసీ సభ్యుడు మీనవల్లి సుబ్బారావు, నాయకులు దాట్ల వెంకటేష్‌రాజు, తాతారావు, దుర్గ, కమలాదేవి, తాతబ్బాయి, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా ఈక్రాప్ నమోదు



జగ్గంపాలెంలో రైతుల నుంచి బయోమెట్రిక్ తీసుకుంటున్న సిబ్బంది

గంగవరం : మండలంలో అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమం శరవేగంగా జరుగుతోంది. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ పర్యవేక్షణలో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనశాఖ సహాయకుల సమన్వయంతో ఈ పంట నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

తాగునీటి పథకాలు ప్రారంభం



సిరిబాలలో తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ కాసులమ్మ

గూడెంకొత్తవీధి : మండలంలోని వంచుల పంచాయతీ సిరిబాల, సీహెచ్ చెరపల్లి గ్రామాల్లో రూ.6లక్షల వ్యయంతో నిర్మించిన తాగునీటి పథకాలను సర్పంచ్ వనపల కాసులమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఈ రెండు గ్రామాలకు రూ.3లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేష్, ప్రసాద్, గణపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గిరిజన సంక్షేమం



జగ్గంపాలెంలో బీజేపీ ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న నాయకులు

గంగవరం : బీజేపీతోనే గిరిజన సంక్షేమమని ఆ పార్టీ గిరిజన మోర్చ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోసూరి సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు శారపు పోతురాజదొర ఆధ్వర్యంలో మొల్లేరు, కొత్తాడ, జగ్గంపాలెం జియ్యంపాలెం సూరంపాలెం గ్రామపంచాయతీలో ప్రజా పోరు యాత్రను నిర్వహించారు.

బాబా ఆలయం వద్ద అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిరిడీసాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల కోసం అన్నదానం ఏర్పాటైంది. దసరా ఉత్సవాల్లో భాగంగా పురోహితులు భయ్యా భానుమూర్తి ఉదయం బాబా వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భక్తులు భజనలు చేశారు. మధ్యాహ్న హారతి పూర్తి అయిన తరువాత జరిగిన అన్నదాన కార్యక్రమానికి వందలాదిగా భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బాబా ఆలయ ప్రాంగణంలో విజయ దశమి నాడు సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట జరుపుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

హుకుంపేట ఎస్‌ఐగా సతీష్



హుకుంపేట: స్థానిక ఎస్‌ఐగా బి.సతీష్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. అరకువేలీ స్టేషన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రతీ గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల విడుదల
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- చింతవానిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



చింతవానిపాలెంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గ్రామసచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం ఆమె జోరువానలో కొయ్యూరు పంచాయతీ చింతవానిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 83 గృహాలను తిరిగారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు ప్రభుత్వం కేటాయించిందన్నారు. వాటి పనులకు సంబంధించి ప్రతిపాదనలను సర్పంచ్‌ల ద్వారా తీసుకున్నామని చెప్పారు. ఇప్పటివరకు 17 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, వర్గాలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు..అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన పథకాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. పంచాయతీల పరంగా సర్పచ్‌ల ద్వారా ఇది వరకు పనులను గుర్తించారన్నారు .త్వరలో ప్రతిపాదించిన పనులను చేపడతామన్నారు. ఆమెకు మహిళల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, మహిళా విభాగం అధ్యక్షురాలు కె రాజులమ్మ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు, చీడిపాలెం సర్పంచ్ సోమన్నదొర, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, కొయ్యూరు ఎంపీటీసీ కె మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే కె భాగ్యలక్ష్మి గురువారం కొయ్యూరులో జల్‌జీవన్ మిషన్ ద్వారా అందించే తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ : మండలంలోని బెంజిపూర్‌లో 50 మంది పేద మహిళలకు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శెట్టి అప్పాలు పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి శెట్టి అప్పాలు అందరికి పంచిపెట్టారు.ఎంపీపీ ఉషారాణి, పెదబయలు జడ్పీటీసీ బొంజుబాబు, వైస్ ఎంపీపీ రామన్న, అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు శెట్టి ఆనంద్, మాజీ ఎంపీపీ అరుణకుమారి, మార్కెట్ కమిటి చైర్మన్ రమేష్, యాసిన్, గురు, భాస్కర్, చిన్నారావు, మోటార్ యూనియన్ నాయకులు సాంబ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ కార్యకర్తల పౌష్టికాహార ప్రదర్శన

గూడెంకొత్తవీధి : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం పంపిణీ చేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వలసమ్మ, మహిళా పోలీసు శాంతి, కార్యకర్తలు జయ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం : ఏజెన్సీలోని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల సమస్యలతో పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సంబంధించి మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఇంజనీర్లను ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం ఇంజనీర్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో మంజూరైన ఇంజనీరింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, బోర్లు, కల్వర్టులపై సమీక్షించారు. ఏజెన్సీలో ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, జియో ట్యాగింగ్ చేయాలని పీవో ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఏజెన్సీలో కొత్తగా 20 ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరి గిందని ఆయన తెలిపారు. ఆధార్ కేంద్రాల పని తీరుపై ఎంపీడీవోలు పర్యవేక్షించాలని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్‌రాజు, నాగేశ్వరరావు, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు, డీఈ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

రూ.62 లక్షలతో అదనపు భవనాలు



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రాంబాబు, ఎంఈవో నాగభూషణం

జి.మాడుగుల: మండలంలో జీఎం కొత్తూరు గ్రామ సమీపంలోని కస్తూర్బా విద్యాలయానికి నాడు-నేడు పథకంలో రూ.62 లక్షలతో చేపట్టనున్న అదనపు భవనాల పనులను గురువారం సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంఈవో కె. నాగభూషణం ప్రారంభించారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుర్మని మత్స్యకొండంనాయుడు, పాడేరు మార్కెట్ కమిటీ ట్రేడర్ అడపా బాబూరావు, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరిలో అగ్గితెగులు ఉధృతి



పైరును పరిశీలిస్తున్న విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో చౌడుపల్లి పంచాయతీలో వమిగెడ్డ కొత్తూరులో గురువారం వ్యవసాయశాఖ అధికారులు మరియు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ ముఖ్యంగా వరిలో అగ్గి తెగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 9గ్రా/ఒక లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు పిచికారి చేయలని తెలిపారు.విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎంపీఎస్ గౌడ, వ్యవసాయాధికారి టి.కన్నబాబు, వీహెచ్ రాజు పాల్గొన్నారు.

ఘనంగా బాబా మందిరం వార్షికోత్సవం



సాయిబాబా విగ్రహానికి హారతి ఇస్తున్న మహిళలు

అడ్డతీగల: స్థానిక మార్కెట్‌వీధిలోని షిర్డీ సాయిబాబా మందిరం 32 వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునుంచే సాయిబాబా విగ్రహానికి పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

తెగుళ్ల పట్ల అప్రమత్తత అవసరం

– కేవీకే శాస్త్రవేత్త శ్రీహరిరావు



జీకే వీధిలో సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు శ్రీహరిరావు, శ్రీకాంత్

గూడెంకొత్తవీధి : వరిలో యాజమాన్య పద్ధతులు పాడించడం ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చని, వరిలో సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని బీసీటీ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు బి.బి.శ్రీహరిరావు సూచించారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో అగ్గి తెగులు సోకినట్లయితే లీటరు నీటిలో ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు కలిపి ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. ఆకుముడత తెగులు సోకితే వేప నూనె, నీమ్ ఆయిల్ 5 ఎంఎం లేదా లీటరు నీటిలో కార్టాప్ హైడ్రోక్లోరైట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొటాష్ లోపం ఎక్కువగా ఉండడంతో ఎకరానికి 15 కిలోల చొప్పున వరి విత్తనాలు వేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భూసార విభాగం శాస్త్రవేత్తలు ఎం.పి.శ్రీకాంత్, ఏవో మధుసూదన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ హక్కు పత్రాలు



గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుజ్జా విజయ

కూనవరం : అర్హత గల ప్రతీఒక్కరికీ పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. కరకగూడెం పంచాయతీలో సర్పంచ్ నూప వెంకన్నబాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కరక రాజులు చైర్మన్‌గా రం లక్ష్మణరావు కార్యదర్శిగా మరో పదిమంది సభ్యులతో ఆర్‌వోఎఫ్ఆర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో వెంకటాయపాలెం ఎంపీటీసీ మడకం నాగరాణి, వీఆర్వో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి వీరన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మ అలంకరణలో అమ్మవారు



దూసరపాము ఆలయంలో అన్నపూర్ణమ్మ అలంకరణలో అమ్మవారు

రాజవొమ్మంగి: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రాజవొమ్మంగి కొండపై, కొండపల్లి, సూరంపాలెం, శరభవరం, దూసరపాము, లాగరాయి. జడ్డంగి, వైకుంఠపురం, చెరకుంపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు అన్నపూర్ణమ్మగా దర్శనమిచ్చారు.

నాడు-నేడుతో మౌలిక సదుపాయాలు



నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సీతమ్మ తదితరులు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం నాడు నేడు ద్వారా పాఠశాలలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు.మండలంలో గల కించాయి పుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ. 98 లక్షలతో చేపట్టనున్న పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఎంపీడీవో ప్రభాకరం, తహసీల్దార్ నర్సమ్మ, ఎంఈవో చెల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున, ఎంపీటీసీలు కమల, సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నాడు-నేడుతో మెరుగైన సౌకర్యాలు

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- నాడు- నేడు పనులకు శంకుస్థాపన



అడ్డతీగలలో నాడు-నేడు పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

అడ్డతీగల: నాడు-నేడు పథకంతో విద్యాలయాల్లో మెరుగైన మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. అడ్డతీగలలోని నాలుగు చోట్ల నాడు-నేడు పథకంలో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే గురువారం భూమిపూజ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.56 లక్షలతో చేపట్టనున్న నాడు-నేడు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రూ.69 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు భూమిపూజ నిర్వహించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో రూ.1.17 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అదనపు భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సీతారామరాజు కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద రూ.16 లక్షల అంచనాతో చేపట్టనున్న నాడు-నేడు పనులను ఆమె ప్రారంభించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద మరుగుదొడ్లు, నీటి సరఫరా పనులు, విద్యుత్ వైరింగ్, ఆయా చోట్ల బ్లాక్ బోర్డులు, ఫర్నిచర్ ఏర్పాటు, భవనాలకు మరమ్మతులు ఇతరత్రా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడానికి మంజూరైన నిధులు వినియోగిస్తారని ఎమ్మెల్యే ధనలక్ష్మి చెప్పారు. అడ్డతీగల సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఎంపీటీసీలు నక్కా ఈశ్వరి, వడ్లమూరి రత్నం, వైఎస్సార్‌సీపీ యువజ విభాగం మండల అధ్యక్షుడు సామిదాల రాజారమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన



అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పాంగి బేసు, ఐసీడీఎస్ సిబ్బంది

హుకుంపేట: నాడు-నేడు పథకంలో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారనున్నాయని తీగలవలస సర్పంచ్ పాంగి బేసు అన్నారు. గురువారం మండలంలోని తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డా గ్రామంలో నాడు-నేడు పథకంలో రూ.14లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని, తద్వారా కేంద్రాలకు చిన్నారులు వచ్చేందుకు ఆసక్తి చూపుతారని ఆయన పేర్కొన్నారు. స్థానిక నేతలు జానకి, శంకర్, దేవరాజు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



సీమంతం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవీపట్నం: వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో హ్యూమన్ డెవలప్‌మెంట్ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇందుకూరుపేటలో గురువారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య భవనం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళి పాల్గొన్నారు. ఎంపీడీవో రవికిశోర్, వైస్‌ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, ఏవో రత్నకుమారి, ఏపీఎం అంబటి సూరమ్మ తదితరులు

17 మందికి కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు



మినుములూరు పీహెచ్‌సీలో ఆపరేషన్ చేస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్

పాడేరు రూరల్ : మండలంలోని మినుములూరు పీహెచ్‌సీలో గురువారం 17 మంది గిరిజనులకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించారు. అనంతరం వారిని ఇళ్లకు పంపించారు.

దుర్భాషలాడిన ఇద్దరిని అరెస్టు చేయాలి

డుంబ్రిగుడ: అరకులోయ మండలం చొంపి గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త జీనందును కులం పేరుతో దూషించి, దుర్భాషలాడిన గిరిజనేతరులు శంకర్, నందినేశ్వరరాలను వెంటనే అరెస్టు చేయాలని గసభ పంచాయతీ మాజీ సర్పంచ్ పాంగి సురేష్,వార్డు సభ్యుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

ఎంపీడీవోగా రవికిషోర్



దేవీపట్నం: దేవీపట్నం ఎంపీడీవోగా పాలెం రవికిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి డీఏవీ పాఠశాల విద్యార్థుల ఎంపిక



ముసారఫ్



వర్షిత



శ్రీనిధి

మోతుగూడెం : స్థానిక ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం నాయుడు తెలిపారు. పాఠశాలకు చెందిన ముసారఫ్, వర్షితలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, శ్రీనిధి అనే విద్యార్థిని నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. హెచ్‌ఎం నాయుడు, ఉపాధ్యాయులను మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు అభినందించారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



వంతాల రోడ్డు మార్గంలో గోతులను పూడ్చుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జి.మాడుగుల: సొలభం పంచాయతీ డేగలరాయి జంక్షన్- వంతాల రోడ్డుకు మరమ్మతులు గురువారం వైఎస్సార్‌సీపీ యూత్ మండల అధ్యక్షుడు కల్యాణం ఆధ్వర్యంలో శ్రమదానంతో గ్రామస్తులు చేపట్టారు. ఈ రోడ్డు మార్గంలో పలుచోట్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. శ్రమదానంతో గోతులు పూడ్చి రోడ్డును మెరుగుపరిచారు.

ఎమ్మెల్యే పర్యటన రేపు

గంగవరం : మండలంలో శనివారం ఎమ్మెల్యే నాగుపల్లి ధనలక్ష్మి పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి రఘునాథ్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు గంగవరం ప్రభుత్వ జూనియర్ కళాశఆలలో నాడు-నేడు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు. 10.30 గంటలకు పెద్ద గార్లపాడులో గిరిజన రైతులకు ఉచిత ఎరువులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 11.30 నుంచి మొల్లేరు గ్రామ సచివాలయం పరిధిలో ఆర్దీపురం, వడ్డి చెరువు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పశువులకు వ్యాక్సినేషన్

గంగవరం : పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు. గురు వారం మర్రిపాలెం గ్రామంలో పశువులకు టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.